క్లుప్తంగా

కొండలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని ఎయిర్‌పోర్ట్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ కె.తులసీబాబు శుక్రవారం దర్శించుకున్నారు. ఆయన్ను ఆలయ ఈఓ కానూరి సురేష్ సన్మానించి అమ్మవారి చిత్రపటంతో పాటు లడ్డూ ప్రసాదాలను అందజేశారు. తొలుత ఆయన పేరిట అమ్మవారికి వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కొడాలి రామరాజు, జనసేన నాయకుడు మాదాసు శ్రీనివాసరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

కేసరపల్లి(గన్నవరం): ఎరువులు, పురుగు మందుల విక్రయాల్లో తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలను పాటించాలని ఎంఏవో ఎస్‌.ఎల్‌.తేజస్వి డీలర్లకు సూచించారు. మండలంలోని కేసరపల్లిలోని ఫెర్టిలైజర్స్ దుకాణాల్లో శుక్రవారం ఆమె ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్లను, ఈపాస్ ద్వారా ఎరువుల విక్రయాలను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..ఫెర్టిలైజర్స్ డీలర్స్ ఈపాస్ పద్ధతిలో మాత్రమే ఎరువులను విక్రయించాలని సూచించారు. స్టాక్ రిజిస్టర్లను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పలువురు గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: యనమలకుదురులో పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ పి.హరిబాబు తెలిపారు. ఆయన శుక్రవారం వివరాలు వెల్లడించారు. యనమలకుదురు సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి 9.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. ఈ కారణంగా యనమలకుదురు ప్రధాన గ్రామం, గొంకరోడ్డు, ఇందిరానగర్ 1, 2 కట్టలు, గ్రీన్ సిటీ కాలనీ, పెదపులిపాక పరిధిలో శ్రీనగర్‌కాలనీ, గణపతినగర్, ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. స్థానికులు తమ సిబ్బందితో సహకరించాలని కోరారు.

పోరంకి సెక్షన్‌లో..

పోరంకి సెక్షన్‌లో కూడా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హరిబాబు వివరించారు. పోరంకి మహాలక్ష్మినగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. బీజేఆర్‌నగర్, నిడమానూరు రోడ్డు, మహాలక్ష్మినగర్, వసంత నగర్, విష్ణుపురంకాలనీ, సాయినగర్, బందర్ రోడ్డు, గద్దె ఆర్టీసీ కాలనీ, లక్ష్మీపురం కాలనీ, బ్రహ్మంగారి గుడి ప్రాంతం, రంగా బొమ్మ ,సుగాలి కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.

వైభవంగా ఆలయ ప్రతిష్ట మహోత్సవం



గన్నవరం: మండలంలోని కేసరపల్లిలో శ్రీమురళీకృష్ణస్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. తొలుత ప్రత్యేక పూజ కార్యక్రమాలు అనంతరం వేలాదిగా తరలివచ్చిన భక్తుల సమక్షంలో ఆలయ ప్రతిష్ఠ జరిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన చేశారు.

ఆలయ నిర్మాణానికి రూ.1.05 లక్షల విరాళం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం సింగన్నగూడెంలో పునర్నిర్మిస్తున్న శ్రీగంగా పార్వతి సమేత సోమేశ్వర స్వామి దేవస్థానానికి దాతలు రూ.1.05 లక్షల విరాళాన్ని అందించారు. గన్నవరం మండలం పురుషోత్తపట్నంకు చెందిన బండి భాస్కర్, చక్రి సోదరులు శుక్రవారం ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ చైర్మన్ నక్కా శ్రీమన్నారాయణ, ఉప సర్పంచ్ బెజవాడ వెంకట కృష్ణారావులకు అందజేశారు. దాతలను కమిటీ సభ్యులు సత్కరించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఉంగుటూరు: జూద శిబిరంపై ఆత్కూరు పోలీసులు ఆకస్మికంగా దాడి చేసి ఏడుగురు వ్యక్తులను శుక్రవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తేలప్రోలు గ్రామంలో ఓ ఇంట్లో రహస్యంగా జూద శిబిరం నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఆత్కూరు ఎస్‌ఐ చావా సురేష్ తన సిబ్బందితో ఆకస్మిక దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.21,450 నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

సిస్టమేటిక్ ఆర్గనైజేషన్ ఉండాలి



కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం దారుణం. ఈ నేపథ్యంలో జిల్లా ఆస్పత్రుల్లో సెక్యూరిటీ పెంచాలి. పేషంట్లు, వారి అటెండెంట్‌లకు ఐడీకార్డులు ఉండాలి. డాక్టర్లు, నర్సులు అందరికీ సెక్యూరిటీ ఇవ్వాల్సిన బాధ్యత యాజమాన్యాలదే. ఆస్పత్రుల అభివృద్ధి కమిటీలలో సామాజిక సేవల్లో ఉండే సంఘ సేవకులను నియమించాలి. సెక్యూరిటీ ప్రమాణాలు అమలు చేయాలి. సిస్టమేటిక్‌గా ఆర్గనైజ్ చేయాలి. నేర్చిన పాఠాలతో భవిష్యత్‌లో మహిళా డాక్టర్‌లను, నర్సులను కాపాడుకోవాలి. మొత్తంగా వారి రక్షణ కర్తవ్యం కావాలి.

–పోలిమెట్ల జయరాజు, రిటైర్డ్ డెప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్, గన్నవరం



పని ప్రదేశాలలో భద్రత పెంచాలి



పని ప్రదేశాలలో మహిళా ఉద్యోగుల భద్రతను దృష్టిలో ఉంచుకొని వారి సంక్షేమం రీత్యా భద్రతను పెంచాల్సిన అవసరం ఉంది. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు మహిళలకు రక్షణ లేకరకుండా పోతోంది. వైద్యులు, సిబ్బంది ఎంతో బాధ్యతాయుతంగా రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. రోగులు, వారి సహాయకులు కలిసి వైద్యులు, సిబ్బంది పట్ల దౌర్జన్యంగా వ్యవహరిస్తూ దాడులకు పాల్పడుతున్నారు. ఇలాంటి పరిస్థితులలో మార్పులు రావాలి. ఆస్పత్రులలో ప్రత్యేకంగా భద్రతా సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉంది. ఇందుకు తగిన ఏర్పాట్లు చేయాలి.

–డాక్టర్ కే హిమబిందు, పిడియాట్రీషియన్, కంకిపాడు

రాజకీయ వేదికలుగా గ్రామ సభలు

- వేదికలపై ఆశీనులైన టీడీపీ నేతలు
- గ్రామ సభల ఉద్దేశం పక్కదారి
- రాజకీయ ఉపన్యాసాలతో సరి



గన్నవరంలో సమస్యలపై నిలదీస్తున్న ప్రజలు

గన్నవరం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు గుర్తించేందుకు శుక్రవారం నిర్వహించిన గ్రామ సభలు టీడీపీ సమావేశ వేదికలుగా మారాయి. ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన ఈ గ్రామసభల్లో ప్రొటోకాల్‌కు విరుద్ధంగా టీడీపీ నేతలను వేదికలపై ఎక్కించారు. వీరంతా ఉపాధి హామీ పనులు గుర్తింపును పక్కనపెట్టి రాజకీయ ఉపన్యాసాలు, గత పాలకులపై ఆరోపణలు, విమర్శలకు సభలను పరిమితం చేశారు. దీంతో గ్రామ సభలు ఏర్పాటు చేసిన లక్ష్యం నీరుగారిపోయిందని విమర్శలు వ్యక్తమయ్యాయి. మండలంలోని కేసరపల్లిలో సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమౌనిక అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. అయితే గ్రామ సభ వేదికపైకి టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు వడ్రాణపు హరిబాబునాయుడు, ఆ పార్టీ నేతలు దొంతు చిన్నా, సూర్యం, మరో ఇరువురిని వేదికపైకి అధికారులు ఆహ్వానించారు. ప్రభుత్వ కార్యక్రమంలో వీరందరూ రాజకీయ ప్రసంగాలు చేశారు. ఉపాధి హామీ పథకం లక్ష్యాలను వివరించేందుకు గాని, ప్రజల సమస్యలను వినేందుకు కూడా సదరు నేతలు ఆసక్తి చూపలేదు. మాజీ ఎమ్మెల్యే మూల్పూరు బాలకృష్ణారావు, వైస్ ఎంపీపీ కాలగడ్డ శివనాగరాజకుమారి, ఎంఏవో ఎస్‌.ఎల్‌.తేజస్వి, పంచాయతీ కార్యదర్శి మౌనిక పాల్గొన్నారు. గన్నవరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన గ్రామ సభలో కూడా ప్రజాప్రతినిధులను పక్కన పెట్టి టీడీపీ నేతను వేదిక ఎక్కించారు. ఈ సభలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులపై కాకుండా గ్రామంలోని సమస్యలపై అధికారులను, ప్రజాప్రతినిధులను ప్రజలు నిలదీశారు. ముఖ్యంగా డ్రెయినేజీ, చెత్త డంపింగ్, తాగునీటి సమస్యలపై గట్టిగా ప్రశ్నించారు. సర్పంచి నిడమర్తి సౌజన్య, పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండల గ్రామాల్లో శుక్రవారం గ్రామ సభలను ఆయా పంచాయతీ కార్యాలయాల వద్ద నిర్వహించారు. రామవరప్పాడులో సర్పంచ్ వరి శ్రీదేవి, ప్రసాదంపాడులో సర్నాల బాలాజీ గంగా రత్నం, ఎనికేపాడులో రాచమల్ల పూర్ణచంద్రరావు, నిడమానూరులో సర్పంచ్ శీలం రంగారావు అధ్యక్షతన గ్రామ సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పంచాయతీ కార్యాలయాల్లో ఉపాధి హామీ పథకం పనుల ఆమోదం, కొత్త పనుల గుర్తింపు, ఆయా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, జరగాల్సిన పనులపై ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలతో చర్చించారు. పలు గ్రామాల్లోని సమస్యలను గ్రామ సభ దృష్టికి తీసుకొచ్చారు. నిడమానూరులో నిర్వహించిన గ్రామ సభలో 8 పనులకు రూ.30 లక్షలు అంచనాతో సర్పంచ్ శీలం రంగారావు ఆధ్వర్యంలో పరిపాలనా ఆమోదం లభించింది. అనంతరం కొత్తగా 24 పనులను గుర్తించారు. ఆయా గ్రామాల్లో జరిగిన గ్రామ సభల్లో పంచాయతీ కార్యదర్శులు ఘంటా రామ్మోహనరావు, రాజేంద్రప్రసాద్, ప్రసాద్, ప్రకాష్ నాథ్, గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రసాదంపాడు గ్రామ సభలో సర్పంచ్ సర్నాల బాలాజీ గంగారత్నం, అధికారులు



రామవరప్పాడు గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ వరి శ్రీదేవి

ఉపాధి నిధులతో అభివృద్ధి పనులు

పెనమలూరు: ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాలలో అభివృద్ధి పనులు చేపట్టడానికే గ్రామ సభలు నిర్వహిస్తాన్నామని ఎంపీడీవో సునీతాశర్మ అన్నారు. మండల పరిధిలో ఆరు గ్రామ పంచాయతీలలో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు.



పెదపులిపాకలో వినతిపత్రం తీసుకుంటున్న సర్పంచి శ్రీనివాసచౌదరి, ఎంపీడీవో



పెనమలూరులో వినతిపత్రం తీసుకుంటున్న సర్పంచి లింగాల భాస్కరరావు

ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ చోడవరం గ్రామంలో రూ.99.70 లక్షలు, గోసాలలో రూ.82.50 లక్షలు, పెదపులిపాకలో రూ.2.44 కోట్లు, పెనమలూరులో రూ.2.25 కోట్లు, వణుకూరులో రూ.2.06 కోట్లతో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ప్రజల విన్నపాల ప్రకారమే పనులు కేటాయింపు చేస్తామని వివరంచారు. గ్రామ సభల్లో సర్పంచిలో కాకర్ల వెంకటరత్నం, లింగాల భాస్కరరావు, గుంటూరు శ్రీనివాసాచౌదరి, చక్క విజయ, అక్బర్ పాషా, సంగెపు శ్రీనివాసరావు, ఏవో లోయ శివశంకర్‌రావు పలువురు పాల్గొన్నారు.

గ్రామ సభల్లో పనులకు ఆమోదం

ఉంగుటూరు: గ్రామ సభలో ఆమోదించిన పనులను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి జిల్లా ట్రైబల్ ఆఫీసర్ వి.ప్రకాష్ సూచించారు. మండలంలోని 27 గ్రామ పంచాయతీలలో ఉపాధి హామీ పథకం పనుల గుర్తింపు గ్రామ సభలు శుక్రవారం నిర్వహించారు. తేలప్రోలులో జరిగిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. నీటి సంరక్షణ–49, వ్యవసాయ అనుబంధ పనులు 38 రకాలను గుర్తించి ఆమోదించారు. ఎంపీపీ వడ్లమూడి సరోజిని, ఎంపీడీవో శేషగిరిరావు, తహసీల్దార్ విమల కుమారి, ఈవోపీఆర్‌డీ అమీర్ బాషా, ఎన్‌ఆర్‌జీఎస్ ఏపీవో వినీల, పలు శాఖల అధికారులు, గ్రామ సర్పంచులు, వింత శ్రీనివాస రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి



ఈడుపుగల్లు గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడెప్రసాద్

కంకిపాడు: ఉపాధి కల్పన సమర్థవంతంగా సాగాలని ఎమ్మెల్యే బోడెప్రసాద్ అన్నారు. ఈడుపుగల్లు గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం గ్రామసభలో ఆయన ప్రసంగించారు. ఉపాధి హామీ పథకం కింద జాబ్‌కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాలన్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులు పెంపకం దారులకు రాయితీ పథకాలు అందుబాటులో ఉన్నాయని పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచి పందిపాటి ఇందిర, టీడీపీ నేతలు మాజీ ఎంపీపీ దేవినేని రాజా, పశువైద్యాధికారి మాధవరావు ఇతర అధికారులు పాల్గొన్నారు. మద్దూరు గ్రామ పంచాయతీలో జరిగిన గ్రామసభలో సర్పంచి చిప్పల రామదాసు, ఎంపీటీసీ ఒడుగు శ్రీనివాసరావు, ఉపాధి హామీ పనులపై సమీక్షించారు.

తుతూమంత్రంగా గ్రామ సభలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలో గ్రామ సభలు శుక్రవారం తుతూమంత్రంగా సాగాయి. ఆయా గ్రామాల్లో జరిగిన గ్రామసభలకు ప్రజల నుంచి స్పందన లభించలేదు. రంగన్నగూడెంలోని కమ్యూనిటీ హాల్‌లో జరిగిన గ్రామ సభకు హాజరైన తహసీల్దార్ వి.నాగభూషణం మాట్లాడుతూ సమగ్ర రీ సర్వేలో దొర్లిన తప్పులను సవరించి రైతులకు కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేస్తామని చెప్పారు. వీరవల్లి–వట్టిగూడిపాడు రోడ్డులో సింగన్నగూడెం వద్ద వెట్టివాగుపై వంతెన నిర్మించాలని, ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు నిర్మించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. బాపులపాడులో సర్పంచ్ సరిపల్లి కమలాభాయి అధ్యక్షతన జరిగిన గ్రామసభలో వెల్లడించిన ఉపాధి పనులపై పలువురు అభ్యంతరాలను వ్యక్తం చేశారు. గ్రామంలోని లోతట్టు ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మించాలని కోరారు. వేలేరులో జరిగిన గ్రామసభలో వివరాలను పంచాయతీ కార్యదర్శి సురేష్ వెల్లడించారు. ఆయా గ్రామసభలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



తేలప్రోలులో మాట్లాడుతున్న ఎంపీడీవో, ట్రైబల్ ఆఫీసర్ ప్రకాష్



బాపులపాడు గ్రామ సభలో మాట్లాడుతున్న సర్పంచ్ సరిపల్లి కమలాభాయి

గ్రామ సభలో సర్పంచ్‌పై నోటి దురుసు

రెచ్చిపోయిన టీడీపీ వార్డు సభ్యులు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడు పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం సర్పంచ్ రాచమల్ల పూర్ణచంద్రరావు అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభలో టీడీపీ వార్డు సభ్యులు కోనేరు నారాయణ, బసవయ్య రెచ్చిపోయారు. సర్పంచ్‌ను టార్గెట్ చేస్తూ నోటికి వచ్చినట్లు దురుసుగా ప్రవర్తించడంతో గ్రామ సభ చివర్లో రసాభాస అయ్యింది. సభ ప్రారంభంలో హెల్త్ విభాగానికి చెందిన సిబ్బంది గ్రామంలో మురుగునీరు నిల్వలేకుండా చేస్తున్నాం, పారిశుద్ధ్యం మెరుగు పరుస్తున్నామంటూ ప్రస్తావించారు. దీంతో టీడీపీ వార్డు సభ్యుడు బసవయ్య కలుగజేసుకుని చేయని పనులకు ప్రచారం చేసుకుంటున్నారని అడ్డుతగిలాడు. సర్పంచ్ పూర్ణ గ్రామంలో ఎక్కడెక్కడ పనులు నిర్వహించారో వివరణ ఇస్తుండగా నోటి దురుసు ప్రదర్శించాడు. దీంతో వాగ్వాదం జరగడంతో సర్పంచ్, పలువురు వార్డు, ఎంపీటీసీ సభ్యులు సమావేశాన్ని ముగించి పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ గదికి చేరుకున్నారు. టీడీపీ నాయకులు సర్పంచ్ గదికి వచ్చి వాగ్వాదానికి దిగారు. ప్రభుత్వం మాది గ్రామంలో మీ పెత్తనం ఏంటని టీడీపీ వార్డు సభ్యుడు కోనేరు నారాయణ రెచ్చిపోయాడు. పార్టీలకు అతీతంగా సమస్యలు పరిష్కరిస్తున్నామని చెబుతున్నా వినకుండా సర్పంచ్‌పై నోటికి వచ్చినట్లు దుర్భాషలాడారు. అక్కడే ఉన్న పోలీసులు జోక్యం చేసుకుని సర్ది చెప్పారు. టీడీపీ నాయకులు పోలీసుల మాట కూడా పెడచెవిన పెట్టడంతో సర్పంచ్, పలువురు వార్డు, ఎంపీటీసీ సభ్యులు సర్పంచ్ గది నుంచి బయటకు వచ్చేశారు.

బీసీ సామాజిక వర్గానికి చెందినవాడిననే..

ఈ ఘటనపై గ్రామ సర్పంచ్ రాచమల్ల పూర్ణచంద్రరావు మాట్లాడుతూ తాను బీసీ సామాజిక వర్గానికి చెందిన వాడిననే చులకన భావంతోనే ప్రతి సమావేశంలో టీడీపీ వార్డు సభ్యులు దూషిస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత టీడీపీ, జనసేన నేతలు పంచాయతీ కార్యాలయంలో వీరంగం సృష్టించిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యాలయంలో బాణసంచా కాల్చి సర్పంచ్ గదిలో కేక్‌కట్ చేసి గోడలకు పులిమారని, మాజీ సీఎంలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటాలను కూడా ధ్వంసం చేశారన్నారు. అప్పటి నుంచి ప్రతి సమావేశంలో తనను మాట్లాడనీయకుండా ఆదిపత్యం ప్రదర్శిస్తున్నారన్నారు. కావాలనే గొడవలకు దిగుతూ మానసిక వేదనకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు జరుగుతున్న అవమానాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

ఘనంగా ప్రకాశం పంతులు జయంతి



గన్నవరంలో టంగుటూరు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బ్రాహ్మణ పరిషత్ సభ్యులు



ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

పెనమలూరు: వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీలో టంగుటూరు ప్రకాశం పంతులు జయంతి ఘనంగా చేశారు. పోరంకి మున్సిపాలిటీ కార్యాలయంలో శుక్రవారం టంగుటూరు ప్రకాశం పంతులు చిత్రపటానికి మున్సిపల్ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. టంగుటూరు ప్రకాశం పంతులు అందించిన సేవలు, కార్యదక్షతను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అనుమోలు ప్రభాకరరావు, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

గన్నవరం: స్థానిక మూడుబొమ్మల సెంటర్‌లో శుక్రవారం బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా టంగుటూరి విగ్రహానికి బ్రాహ్మణ పరిషత్ సభ్యులు క్షీరాభిషేకం చేసి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పరిషత్ అధ్యక్షుడు పన్యారం విష్ణుమూర్తి మాట్లాడుతూ.. స్వాతంత్ర్య ఉద్యమం కోసం యావదాస్తిని ఖర్చు చేసిన గొప్ప దేశభక్తుడని తెలిపారు. ఆంధ్ర రాష్ట్ర మొట్టమొదటి ముఖ్యమంత్రిగా పని చేసిన ఆయన నిస్వార్థ ప్రజాసేవకుడికి చరిత్రలో నిలిచారని చెప్పారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతిఒక్కరూ నడుచుకోవాలని పిలుపునిచ్చారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్. కిషోర్, బ్రాహ్మణ పరిషత్‌కు చెందిన గోపరాజు సత్యపవన్‌కుమార్, మామిళ్లపల్లి నాగసుబ్బారావు, తిమ్మరాజు వెంకటసుబ్బారావు, చదలవాడ శివనాగేశ్వరరావు, ఆదిత్య, వకుల తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదు



హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం రంగన్నగూడెంకు చెందిన ఓ వృద్ధుడు అదృశ్యంపై వీరవల్లి పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. రంగన్నగూడెంకు చెందిన మొవ్వా శ్రీమన్నారాయణ (60) అనే వృద్ధుడు ఈ నెల 21వ తేదీన మెడికల్ షాపులో మందులు కొనుగోలు చేసేందుకు గ్రామానికి చెందిన ఓ యువకుడి బైక్‌పై హనుమాన్‌జంక్షన్ వచ్చాడు. స్థానిక కేఎస్ టాకీస్ వద్ద బైక్ దిగిన వృద్ధుడు ఆ తర్వాత కనిపించకపోవటంతో కుటుంబ సభ్యులు ఆందోళనతో పలుచోట్ల గాలించారు. అయినప్పటికీ ఫలితం దక్కకపోవటంతో వీరవల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కృష్ణానది నుంచి తాగునీరు ఇవ్వాలి

పాతపాడు(విజయవాడరూరల్): పాతపాడు గ్రామానికి కృష్ణానది నుంచి తాగునీరు సరఫరా చేయాలని గ్రామ ప్రజానీకం అధికారులను కోరారు. శుక్రవారం పాతపాడు గ్రామ సర్పంచి దేవగిరి సుజాత అధ్యక్షతన గ్రామ సభ జరిగింది. ఎంపీడీఓ బి.భార్గవిని ప్రజలు కృష్ణానది నుంచి తాగునీరు సరఫరా చేయాలని, గత కొంత కాలంగా బోరు నీటిని తాగడం వలన అనారోగ్యాలతో అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీడీఓ భార్గవి మాట్లాడుతూ తాగునీటి సమస్య పరిష్కారించేందుకు కృషి చేస్తామన్నారు. గ్రామంలో రెండు సీసీ రోడ్లు నిర్మించడానికి గ్రామసభ తీర్మానం చేసింది. గ్రామ సభలో పాలకవర్గం సభ్యులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణకుమారి, గ్రామ కార్యదర్శి ఎస్.చెన్నకేశవరావు, గ్రామస్తులు పాల్గొన్నారు. నున్న గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ ఉప సర్పంచి కలకోటి బ్రహ్మనందరెడ్డి అధ్యక్షతన గ్రామసభ జరిగింది. రెండు సీసీ రోడ్లు, రెండు డ్రెయిన్లు, పశువులషెడ్లు, బోదె కాల్వల పనులకు గ్రామ సభ తీర్మానం చేసింది. గ్రామసభలో ఎంపీటీసీ సభ్యురాలు బొంతు సరోజిని, పాలకవర్గం సభ్యులు, గ్రామ కార్యదర్శి జీటీవీ రమణ పాల్గొన్నారు. అంబాపురంలో సర్పంచి గండికోట సీతయ్య అధ్యక్షతన జరిగింది. అభివృద్ధి పనులపై తీర్మానం చేశారు. ఉపసర్పంచి నందిపాముల శ్యామల, ఎంపీటీసీ సభ్యురాలు జోగా మల్లేశ్వరి, పాలకవర్గం సభ్యులు, కార్యదర్శి పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. పి.నైనవరం గ్రామ సభ సర్పంచి బట్టా సోమయ్య అధ్యక్షతన జరిగింది. పలు అభివృద్ధి పనులకు సంబంధించి చర్చించారు. గ్రేడ్ 5 కార్యదర్శి సంతోష్ పాలకవర్గం సభ్యులు గ్రామ సభలో పాల్గొన్నారు.



పాతపాడులో మాట్లాడుతున్న ఎంపీడీఓ భార్గవి

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి పూజలు

కంకిపాడు: శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రొద్దుటూరు గాయత్రి విహార్‌లో శుక్రవారం విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ఉన్న ధ్యాన యోగసాయి మందిరంలో వరలక్ష్మీవ్రతం భక్తి శ్రద్ధలతోజరిపించారు.పూజా కార్యక్రమాలను గాయత్రి విహార్ అసోసియేషన్ సభ్యులు పర్యవేక్షించారు.

పెనమలూరు:యనమలకుదురులో శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఉదయం శ్రీపార్వతీదేవికి అభిషేకం చేశారు. అనంతరం చండీహోమం నిర్వహించారు. సామూహిక కుంకుమార్చన చేశారు. అర్చకుడు జీఆర్‌వీ సాగర్ పూజలు నిర్వహించారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ అభివృద్ధి దాత సంగా నరసింహారావు, ఈవో ఎం.గంగాధరరావు,భక్తులు పాల్గొన్నారు.



గాయత్రీవిహార్‌లో పూజలు చేస్తున్న భక్తులు

పేరంటాలమ్మకు గాజుల అలంకరణ

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో అమ్మవార్లు శుక్రవారం గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని అమ్మవారి భక్తులు అందించిన గాజులతో ముగ్గురమ్మలను అలంకరించారు. ఈ సందర్భంగా గ్రామంతో పాటు పలు గ్రామాల్లోని భక్తులు వేకువజాము నుంచే పెద్ద సంఖ్యలో మహిళలు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి మాట్లాడుతూ భక్తుల రద్దీని దృష్టిలో తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ గాజుల అలంకరణకు భక్తులు విశేషంగా స్పందించి గాజులు అందించారన్నారు.



గాజుల అలంకరణలో ఉన్న వెంకమ్మ పేరంటాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు